క్లుప్తంగా

హెల్మెట్ ధారణతో ప్రాణాలు పదిలం


వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై జానీ బాషా

కె.గంగవరం: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్‌ను ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని పామర్రు ఎస్సై షేక్ జానీ బాషా అన్నారు. కె.గంగవరం మెయిన్ సెంటర్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడిపితే చోటు చేసుకునే అనర్థాలను వివరించారు.

సేంద్రియ ఎరువుకు ప్రాధాన్యమివ్వాలి

కాజులూరు: వ్యవసాయ సేద్యంలో సేంద్రియ ఎరువుల వాడకానికి రైతులు ప్రాధాన్యమివ్వాలని మండల వ్యవసాధికారి వి అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడారు. రసాయన ఎరువుల రేట్లు విపరీతంగా పెరిగి పోతుండడంతో పెట్టుబడులు అధికమవ్వడమే కాక పంట ఉత్పత్తులు విషతుల్యమై నాణ్యత లోపించే ప్రమాదం ఉందన్నారు. విత్తన శుద్ధికి జీవామృత వినియోగం, సస్య రక్షణకు గోవు పేడ, మూత్రం కషాయం వంటివి తయారు చేసి పంటలకు సోకే పలు రకాల తెగుళ్లపై వినియోగించ వచ్చునన్నారు. రైతులకు సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అనేక అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తున్నామన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో తణుకువాడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, స్థానిక రైతు సంఘం నాయకులు నున్న లక్ష్మణరావు, పోలినాటి సూర్యచంద్రం, పలువురు రైతులు పాల్గొన్నారు.

30 వరకు పశు వైద్య శిబిరాలు

రామచంద్రపురం రూరల్: నేటి నుంచి ఈ నెల 30 వరకు మండలంలోని 25 గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున ఆదివారం తెలిపారు. ఏడీ డాక్టర్ ఓ.రామకృష్ణ పర్యవేక్షణలో పాడి పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సతో పాటు నట్టల నివారణ, వ్యాక్సినేషన్ చేయనున్నట్లు తెలిపారు. పాడి రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలోని పాడి రైతులు ఈ ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ

కపిలేశ్వరపురం: మాతృ వియోగంతో బాధపడుతున్న వెదురుమూడికి చెందిన మండపేట ఏఎంసీ మాజీ చైర్మన్ నక్కా సింహాచలాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు, వైస్ ఎంపీపీలు సాకా శ్రీనివాస్, గుణ్ణం భాను ప్రసాద్, నాయకులు కొమ్ము రాంబాబు, ప్రగడ అర్జునరావు పరామర్శించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన యార్లగడ్డ శ్రీను కుటుంబానికి రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం పరామర్శించి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామంలో మృతి చెందిన కూనపరెడ్డి వరలక్ష్మి, తుమ్మలపల్లి మంగలక్ష్మి కుటుంబాలను సైతం మంత్రి పరామర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, స్థానిక కూటమి నేతలు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడికలు తొలగించాలి


మొగలిపాలెంలో పూడుకుపోయిన పంట కాలువ

కాజులూరు: వరి పొలాల మధ్య ఉన్న పంట కాలువల్లో పూడికలు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం వరి పొలాల్లో నాట్ల దశ పూర్తయ్యి దుబ్బుకట్టే దశలో ఉన్నాయి. ఈ దశలో పొలాలకు సాగునీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. అయితే పంట కాలువల్లో గడ్డి, తూడు పెరిగి పోవడంతో పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు చెబుతున్నారు. గతంలో ఖరీఫ్, రబీ సాగు ప్రారంభానికి ముందుగా ఉపాధి పనుల ద్వారా పంట కాలువల్లో పూడికలు తొలగింపు పనులు జరిగేవి. ఇటీవల ఉపాధి పనులు సక్రమంగా జరగక పోవటంతో కాలువల పూడికతీత పనులు జరగలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువ శివారు భూములకు సాగునీరు చేరడం లేదు. అధికారులు స్పందించి పంట కాలువల్లో పూడికతీత పనులు నిర్వహించేందుకు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

సిరుల జల్లు

- వెదజల్లుతో అధిక లాభాలు
- ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ
- సాగుకు అన్నదాతల ఆసక్తి


ఏపుగా పెరిగిన వెదజల్లు చేను

రామచంద్రపురం: సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకుంటున్నారు. పదిహేనేళ్ల క్రితం వ్యవసాయానికి, ఇప్పటి వ్యవసాయానికి తేడాను గమనిస్తూ వ్యవసాయాధికారుల సూచనలతో ముందుకు సాగుతున్నారు. తాజాగా వెదజల్లు పద్ధతిలో చేస్తున్న వరిసాగు విధానంతో రైతులకు మేలు చేకూరుతుంది. అప్పట్లో వెదజల్లు పద్ధతిని రైతులకు తెలియజేసేందుకు వ్యవసాయాధికారులు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. ప్రస్తుత పరిస్థితులు పూర్తిగా మారాయి. ఇప్పుడు రబీ సాగులో రైతులు పూర్తిగా వెదజల్లునే ఎంచుకుంటున్నారు. వెదజల్లిన చేలు ఏపుగా ఎదగడం వల్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో రబీలో 94వేల ఎకరాల్లో వరి సాగును రైతులు చేస్తున్నారు. గతంలో అయితే 50 శాతం మాత్రమే వెదజల్లు సాగు చేసేవారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఈ సారి 90 శాతం వెదజల్లు సాగును రైతులు చేపట్టారు.

ప్రయోజనాలు ఎన్నో..

దాళ్వా సాగులో రైతులు వెదజల్లేందుకే మొగ్గు చూపారు. వెదజల్లడం మూలంగా కూలీల రేటు కలిసి వస్తుందని, మాసూళ్లు కూడా ముందుగా వస్తాయని, దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులు ఆశాభావం వ్యకం చేస్తున్నారు. విత్తనాల దగ్గర నుంచి ఎరువులు, పురుగు మందుల ఖర్చులు బాగా తగ్గటంతో వెదజల్లేందుకు రైతులు ఆశక్తి చూపిస్తున్నారు. వెదజల్లు సాగుతో నీటి వాడకం కూడా తగ్గించుకోవచ్చని రైతులు చెబుతున్నారు. దాళ్వా సాగులో సాధారణంగా సాగునీరు అందటం కొంచెం కష్టతరమవుతుంది. ఈ పరిస్థితుల్లో వెదజల్లడం వల్ల సాగునీటి కష్టాలు కూడా తప్పుతున్నాయి. పంట కాలం సమయం కూడా తగ్గటం మూలంగా మాసూళ్లను సైతం రైతులు ముందుగా పూర్తి చేసుకొని మూడో పంటకు సైతం వెళ్లే అవకాశాలుంటున్నాయి. వెదజల్లటం వల్ల దిగుబడి కూడా పెరుగుతుంది. ఎకరాకు సుమారుగా 45 నుంచి 50 బస్తాల వరకు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. దీంతో మొత్తంగా రూ.10వేల వరకు రైతులకు ఆదా అవుతుంది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు ఇప్పటికే రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో దాదాపుగా రబీ వరి నాట్లను పూర్తి చేశారు. ముందుగా వెదజల్లిన వరిచేలు ఇప్పటికే ఏపుగా పెరుగుతున్నాయి. వాతావరణం సానుకూలంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయం బాగుంది



దాళ్వా సాగులో గత కొన్నేళ్లుగా వెదజల్లునే చేస్తున్నాం. దీని మూలంగా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుంది. మొదటి పంటలో నష్టం వచ్చినా పూడ్చుకునే వీలు కలుగుతుంది. దీంతో రైతులంతా వెదజల్లునే అనుసరిస్తున్నారు.

గుణ్ణం రామకృష్ణ, రైతు, కొత్తూరు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రబీ సాగులో రైతులంతా వెదజల్లుతోనే సాగు చేస్తున్నారు. దీని మూలంగా నీటి ఎద్దడిని నివారించవచ్చు. దిగుబడులు సైతం అధికంగా వస్తాయి. రైతులు సాగునీటి యాజమాన్య పద్ధతులు పాటించి నీటి ఎద్దడిని అధిగమించాలని సూచిస్తున్నాం.

సత్యప్రసాద్, ఏఓ, రామచంద్రపురం.

పరీక్ష కేంద్రం తనిఖీ


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో అఖిల

రామచంద్రపురం: డివిజన్ పరిధిలో గల రేషన్ షాపు డీలర్ల నియామకానికి సంబంధించి స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియోన్నత పాఠశాలలో ఆదివారం పరీక్షను నిర్వహించారు. ఆర్డీవో డీ అఖిల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ పరీక్షకు మొత్తం 135 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 8 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 127 మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

ధనమ్మ మర్రికి భక్తుల తాకిడి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని ధనమ్మ మర్రిని ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున సందర్శించారు. ఆదివారం సెలవుదినం కావడంతో ఉద్యోగ, వ్యాపార వర్గాలు ధనమ్మతల్లికి పూజలు చేశారు. ఆలయ సమీపాన గోదావరి తీరం, ఉద్యాన వనాలను సందర్శిస్తూ సరదాగా గడిపారు. కపిలేశ్వరపురం, కె.గంగవరం, కొత్తపేట, రావులపాలెం మండలాల పరిధిలోని గ్రామాల నుంచి భక్తులు, పర్యాటకులు ధనమ్మమర్రిని సందర్శించారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

అయినవిల్లి: ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.మనోహర్‌జోషి తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం వీరవల్లిపాలేనికి చెందిన అడపా నాగేశ్వరరావు, అతని భార్య గంగభవాని శనివారం సాయంత్రం మోటార్‌సైకిల్‌పై అమలాపురం వెళ్తున్నారు. మార్గంమధ్యలో విలస కంటి ఆస్పత్రి వద్ద వెనుక నుంచి ఆటో ఓవర్‌టేక్ చేస్తూ వీరి మోటార్ సైకిల్ ఢీకొంది. భార్యాభర్తలిద్దరూ రోడ్డుపై పడిపోయారు. భర్త నాగేశ్వరరావుకు ముఖానికి బలమైన రక్తపు గాయాలయ్యాయి. నాగేశ్వరరావు స్థానికులు, అతని బంధువులు అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై నాగేశ్వరరావు బంధువులు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముత్యాలమ్మా.. దయ చూపవమ్మా

- వైభవంగా గ్రామోత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


రాయవరంలో ముత్యాలమ్మకు నిర్వహిస్తున్న గ్రామోత్సవం


అమ్మవారి జాతరకు పోటెత్తిన భక్తులు

రాయవరం: ముత్యాలమ్మ తల్లీ.. పిల్లా పాపలు, పాడి పంటలు, పసుపు కుంకుమలను చల్లగా చూడమ్మా.. అంటూ మహిళలు వేడుకున్నారు. అమ్మవారికి అడుగడుగునా పసుపు నీళ్లతో స్వాగతించి నైవేద్యాలను సమర్పించుకున్నారు. గ్రామదేవత పోలమ్మ అమ్మవారి జాతరకు ముందుగా రాయవరంలో ఏటా ముత్యాలమ్మ జాతర జరపడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కొప్పు వెలమ కులస్తుల ఆరాధ్య దైవంగా కొలవ బడుతున్న ముత్యాలమ్మ అమ్మవారికి కొప్పువెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. జాతరలో భాగంగా ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన వాహనంలో ఊరేగించారు. ఉత్సవ విగ్రహానికి ముందు నడిచే ముత్తయిదువుల కాళ్లపై మహిళలు బిందెలతో పసుపు నీళ్లను పోసి అమ్మవారిని స్వాగతించారు. మంగళ వాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు సాగింది. కొందరు మహిళలు ఘంటా దీపాన్ని శిరస్సున ధరించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ ఎత్తున బాణాసంచా కాల్చారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాదు వెంకటరమణ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అలరించిన గరగ నృత్యాలు

గ్రామోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యాలు ఆద్యంతం అలరించాయి. వాయిద్యాలకు అనుగుణంగా గరగ నృత్య కళాకారులు చేసిన అభినయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నేలపై భక్తులు ఉంచిన రూపాయి కాగితాలు, కూల్‌డ్రింక్‌లను శిరస్సుపై ఉంచిన గరగలు పడిపోకుండా నోటితో తీసిన తీరు అందరినీ అబ్బుర పరిచాయి. తీన్‌మార్, గారడీలు అలరించాయి.

గుర్తుకొచ్చిన మధుర జ్ఞాపకాలు


వాకతిప్ప జెడ్పీ పాఠశాలలో 1975-76 బ్యాచ్ విద్యార్థులు

పరిమళించిన యాభై ఏళ్ల స్నేహ బంధం

కపిలేశ్వరపురం: మండలంలోని వాకతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1975–76 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. పదో తరగతి చదివి ఏభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా అలనాటి విద్యార్థులంతా కుటుంబ సమేతంగా హాజరై ఆనందోత్సాహాలతో గడిపారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వీరంతా ఓచోట చేరటంతో సందడి వాతావరణం నెలకొంది. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాల దొంతరలలోకి జారుకున్నారు. ఈ సందర్భంగా పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో చేకూరి పాపారావు, పోలిన సూర్య భగవాన్, పోలిన కృష్ణ భగవాన్, పాలడుగు అచ్యుతరామయ్య చౌదరి, అడపా సత్తిరాజు, గద్దె సుజాత, చిట్టూరి ఝాన్సీ రాణి, కోడూరి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కృష్ణారెడ్డిని పరామర్శించిన పలువురు ప్రముఖులు


రామవరంలో సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఆయన సోదరులను పరామర్శిస్తున్న త్రినాథ్‌రెడ్డి తదితరులు

పెదపూడి: అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, రామవరం గ్రామ ఉప సర్పంచ్ మాతృమూర్తి సబ్బెళ్ల బాపాయమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని, కృష్ణారెడ్డి సోదరులు శ్రీనివాసారెడ్డి, వెంకటకృష్ణారెడ్డిలను వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం నాయకుడు కొవ్వూరి త్రినాథరెడ్డి, పలువురు ప్రముఖులు పరామర్శించారు. తూర్పుగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి వెంకటరెడ్డి, మాజీ అధ్యక్షుడు బుల్లి మోహన్‌రెడ్డి, ప్రముఖ హైకోర్టు న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డి, ఎస్‌బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్తి బుల్లి స్వామిరెడ్డి, జిల్లా రైతు విభాగం నాయకుడు ప్రసన్న, విఘ్నేశ్వర సంస్థల అధినేత సత్తి వెంకటరెడ్డి, ఎన్డీఏ నాయకులు ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

మందకొడిగా దాళ్వా వరి నాట్లు


ముక్కామలలో వరి నాట్లు వేస్తున్న రైతులు

అంబాజీపేట: మండలంలో రబీ నాట్లు మందగొడిగా కొనసాగుతున్నాయి. వాస్తవానికి సంక్రాంతి నాటికి వరి నాట్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా ఇంకా నాట్లు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మరో పది రోజుల్లో నాట్లు వేసే ప్రక్రియ పూర్తవుతుందని వ్యవసాయ శాఖాధికారులు అంటున్నారు. సార్వాలో కురిసిన భారీ వర్షాల వల్ల దాళ్వా పంట సాగుపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో ఏటా సంక్రాంతి నాటికి నాట్లు పూర్తి అవుతుండగా రైతుల ఒడిదొడుకుల మధ్య సాగు చేస్తుండడంతో అలస్యానికి కారణమని పలువురు అంటున్నారు. మండల వ్యాప్తంగా 3010 ఎకరాల విస్తీర్ణం దాళ్వా సాగు జరుగుతుండగా ఇప్పటి వరకు కేవలం 650 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ తెలిపారు. మిగిలిన ఎకరాల్లోని నాట్లు పది రోజుల్లో పూర్తవుతాయని చెబుతున్నారు. మండలంలోని రైతులు 120 రోజుల స్వల్ప కాలిక వరి వంగడాలైన పీఆర్ 126, ఎంటీయూ 1121, బొండాలు సాగు చేస్తున్నారని, దీని వల్ల పంట రైతులకు ముందుగానే అందుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

తాగునీటికి తప్పని తిప్పలు

- లోప భూయిష్టంగా జల్‌జీవన్ మిషన్ పనులు
- గగ్గోలు పెడుతున్న జనం


ఏరుపల్లి ఎస్సీ పేట వద్ద నిరుపయోగంగా మారిన మంచినీటి కుళాయి

రామచంద్రపురం రూరల్: జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న మంచినీటి కుళాయిలతో అసలుకే మోసం ఎదురవుతోందని ఏరుపల్లి గ్రామస్తులు వాపోతున్నారు. గతంలో మంచి నీరు సక్రమంగానే సరఫరా అయ్యేదని జలజీవన్ మిషన్ ద్వారా పైపులైన్‌లు వేసిన తరువాతే ఈ సమస్య ఉత్పన్నం అయ్యిందని వాపోతున్నారు. దీనిపై గ్రామ సర్పంచ్ మల్లిమొగ్గల శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్‌లను వివరణ కోరగా సమస్య ఉన్నమాట వాస్తవమేనని తరచుగా పైపులైన్లు రిపేరుకు వస్తున్నాయని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీలు లేని కారణంగా రిపేర్లు వస్తున్నప్పుడు లీకేజీ అవుతున్న నీటి కారణంగా పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. రైతులు ఇబ్బంది పడకూడదని నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సరఫరాలో ఇబ్బందులను పరిష్కరించాలి



గ్రామంలో జల్‌జీవన్ పథకంలో పైపులైన్ వేసిన దగ్గర నుంచి నీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయి. లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పథకాలు ప్రజలకు సక్రమంగా ఉపయోగపడకపోతే ప్రయోజనం ఏంటి. ప్రజలు పంచాయతీ కుళాయిల నుంచి మంచి నీరు వస్తుందన్న నమ్మకాన్ని వదిలేశారు.

సాక్షి వేణుగోపాలరావు, మాజీ సర్పంచ్, ఏరుపల్లి

కపిలేశ్వరపురం మండల అధికారులు

ఎ.శాంతి	మండల ప్రత్యేకాధికారి	9154409527
చిన్నారావు	తహసీల్దార్	8008803196
వెంకటేశ్వరరావు	డిప్యూటీ తహసీల్దార్	9441814301
కేవీఎన్ రమేష్‌కుమార్	ఏఓ, వ్యవసాయ శాఖ	8331056560
డా.పీఎస్ఎస్‌డి రత్నకుమారి	వైద్యాధికారి, అంగర	9247861182
డా.కె.విజయదీపిక	వైద్యాధికారి అచ్యుతాపురం	9182650968
డా.సీహెచ్.రాకేష్ కృష్ణ చౌదరి	వైద్యాధికారి, వాకతిప్ప	9742129535
కె.తాతారావు	ఎంఈఓ, విద్యాశాఖ	9492479542
కె.శ్రీనివాసరెడ్డి	ఏఈ, హౌసింగ్	7093930492
వీరభద్రరాజు	ఆర్‌డబ్ల్యూఎస్	9440387471
ఎన్.షాలెంరాజు	ఏఈ విద్యుత్ శాఖ	9440812645
డా.సీహెచ్.ఇందుప్రియ	వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, కేపీపురం	9059032457
డా.వీవీరమణమూర్తి	వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, అంగర	9989789978
అధికారి గజలక్ష్మి	సీడీపీఓ మండపేట ప్రాజెక్ట్, ఐసీడీఎస్	8500758785
త్రిమూర్తులు	ఏఈ ఇరిగేషన్ ఆలమూరు సెక్షన్	9989329772
సుబ్రహ్మణ్యం	ఏఈ ఇరిగేషన్ కోటిపల్లి సెక్షన్	9908484824
అజీజ్	ఏఈ, ఇరిగేషన్ రామచంద్రపురం సెక్షన్	8500786756
వి.సుజాత	ఏఈ, ఇరిగేషన్ ద్రాక్షారామ సెక్షన్	7702322777
దొరరాజు	సీఐ, మండపేట రూరల్	9440796537
డి.రవికుమార్	ఎస్సై, అంగర పోలీస్ స్టేషన్	9440900770
సాయి చంద్రిక	ఏఈ డ్రైయిన్స్, రామచంద్రపురం	8886066939
వై.వెంకటేశ్వరరావు	డిప్యూటీ ఈఈ, ఆర్‌అండ్‌బీ, ఆర్సీపురం	9440818285
వి.వెంకటరమణ	ఏఈ, ఆర్‌అండ్‌బీ, మండపేట సబ్‌డివిజన్	9440818537
జి.దుర్గాప్రసాద్	ఏపీఎం, ఐకేపీ	9652304198
డేవిడ్‌రాజు	ఎఫ్‌డీఓ, మత్స్యశాఖ	9948029350
కె.రవికిరణ్	ఏపీఓ, ఎన్ఆర్ఈజీఎస్	7702072981
డీవీ రాఘవులు	మండల ఇంజనీరింగ్ అధికారి	9966526720
కామేశ్వరరావు	ఎండోమెంట్ అధికారి	9908792945
పేపకాయల భాస్కరరావు	మేనేజర్, ఆర్టీసీ, ఆర్సీపురం డిపో	7382825536
కేడీఎస్ఎస్‌కుమార్	మేనేజర్, ఆర్టీసీ, రావులపాలెం డిపో	9959225537
వెంకటేశ్వరరావు	ఏఎస్‌డబ్ల్యూఓ, సోషల్‌వెల్ఫేర్	9492168780
కె.శివనాగమల్లేశ్వరరావ	కార్మికశాఖ అధికారి	9492555059
డీఎస్ఎన్ మూర్తి	ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్	9849352664
నాగేశ్వరరావు	ఎక్సైజ్ సీఐ ఆలమూరు	9701287828
కోటేశ్వరరావు	ఉద్యాన శాఖాధికారి	8712625210

తలరాతను మార్చేదే భగవద్గీత

అయినవిల్లి: భగవద్గీత పఠనంతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని, భక్తుల తలరాతను మార్చుతుందని అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ హరే కృష్ణ మంత్రం జపించడం మంచిదన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

ఘనంగా జాతర

కొత్తపేట: ఆత్రేయపురం మండలంలోని మెర్లపాలెంలో గ్రామదేవత పద్మాలవెంకమ్మ అమ్మవారి జాతర, ఆకులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీలు అమ్మవారి జాతరలను వేరువేరుగా నిర్వహించాయి. ఈ సందర్భంగా పద్మాలవెంకమ్మ అమ్మవారిని గౌతమి గోదావరికి మేళతాళాలతో తీసుకుని వెళ్లి స్నానాది, పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో వివిధ సాంస్కృతిక కళా నృత్యాలతో జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆకులమ్మ అమ్మవారి గ్రామోత్సవం, జాతర మహోత్సవాలు గరాగ నృత్యాలుతో ఘనంగా నిర్వహించారు.